ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 02.03.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా దేశాల్లో నివసిస్తున్న భారత్ పౌరుల భద్రత కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేశారు.

2. వికారాబాద్ జిల్లాలో తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల రాజకీయ శిక్షణా తరగతులు ఈరోజు ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ రోజు నేతలకు దిశా నిర్దేశం చేశారు.

3. ఎస్ఎల్ బిసి సొరంగ మార్గాన్ని 2028 జున్ నాటికి పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

4. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ వేలంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

**కంట్రోల్ రూమ్**

పశ్చిమ ఆసియాలో నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలంగాణ పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ప్రభుత్వం అక్కడి పరిస్థితులను

పర్యవేక్షిస్తోంది. ఇబ్బందుల్లో ఉన్న వారు, వారి కుటుంబ సభ్యులు సహాయం కోసం వందన బరువా - 9871999044, చక్రవర్తి - 9958322143, జావేద్ హుస్సేన్ - 9910014749, రక్షిత్ నాయక్ - 9643723157 మొబైల్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. ప్రయాణ అంతరాయాలు, ఇతర అత్యవసర సమయాల్లో అవసరమైన సమన్వయం, సహాయాన్ని అందించేందుకు ఈ బృందం అందుబాటులో ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రంతో కలిసి పౌరుల క్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ సర్కార్ భరోసా ఇచ్చింది.

డెస్క్

**రాహుల్ గాంధీ**

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్ లో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల డీసిసి అధ్యక్షుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొని రెండు రాష్ట్రాల నేతలకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగింది. 10 రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరంలో పార్టీ బలోపేతం, నాయకత్వ సామర్థ్యాలు, అభివృద్ధి వ్యూహ రచన, తదితర అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, వికారాబాద్

**సీతక్క**

మహిళా సంక్షేమం, సాధికారత కోసం అవలంభించాల్సిన నూతన విధానాలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షలో పలు కీలక శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డెస్క్

**వాకిటి శ్రీహరి**

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సచివాలయంలో వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో క్రీడలు, క్రీడాకారులకు కేటాయించాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఆటల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. ఒలంపిక్, పారాఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతాకాలు సాధించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

జీఎస్

**కోమటిరెడ్డి**

**SLBC** సొరంగ మార్గాన్ని 2028 జూన్ నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదని అన్నారు. ముఖ్యమంత్రి చొరవతో మళ్లీ పనులు మొదలుపెట్టగా 18 మీటర్లు పూర్తైందని అన్నారు. ఈ సొరంగం పూర్తైయితే జిల్లా లోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

డెస్క్

**గవర్నర్ హోళీ**

హోళీ పర్వదినం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండగైన హోళీ ఐక్యతను పెంపొందిస్తు సమాజంలో శాంతి, సౌభాగ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఇది సామాజిక బంధాలను కూడా బలపరుస్తుందని చెప్పారు. హోళీకి సంబంధించిన పురాణ గాధలు చెడుపై సత్యం, ధర్మం, గెలుస్తాయని బోధిస్తాయన్నారు.

జీఎస్

**సజ్జనార్**

హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు రేపుఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు మూసివేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. స్టార్ హోటళ్ళు, రిజిస్టర్డ్ క్లబ్బులకు అనుబంధంగా ఉన్న బార్లకు ఈ నిబంధన వర్తించదని తెలియజేశారు. మరోవైపు.. అయిష్టంగా ఉన్న వ్యక్తులపై రంగు లేదా రంగు నీళ్ళు చల్లడం, బహిరంగ ప్రదేశాలలో వేధింపులకు పాల్పడడం నిషేధమని పేర్కొన్నారు. అలాగే సమూహాలుగా రోడ్లపై టూ వీలర్లు, ఇతర వాహనాలు నడపడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం కూడా నిషేధమని సీపీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 76 కింద చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

**జీఎస్**

**కేటీఆర్**

సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారక రామారావు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. సుమారు వెయ్యి నూట పది ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్ పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆయన ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్ 2015 ఉల్లంఘన జరిగిందని, హైకోర్టు సూచనలు పట్టించుకోలేదని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తి కాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించారని, మైనింగ్ కేసులు ఎదుర్కొంటున్న వారికి బ్లాక్‌లు కేటాయించారని అనుమానాలు వ్యక్తం చేశారు. టెండర్లు రద్దు చేసి స్వతంత్ర విచారణ నిర్వహించాలని, అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**జీఎస్**

**వాకిటి శ్రీహరి – గుజరాత్**

గుజరాత్ లో పాడిపరిశ్రమ అభివృద్ధి విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆనంద్ లోని ప్రముఖ అమూల్ పాల ప్రాసెసింగ్ ప్లాంట్ ను తెలంగాణ బృందం సందర్శించింది. ఈ

సందర్భంగా తమ సంస్థలో అమలు చేస్తున్న ఆధునిక, సాంకేతిక విధానాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పాల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ వ్యవస్థలపై తెలంగాణ బృందానికి అమూల్ ఛైర్మన్ డాక్టర్ మీనేష్ షా వివరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ… గుజరాత్ లో అమూల్ మోడల్ ద్వారా సాధించిన విజయాలు తెలంగాణకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహిళల ఆర్థిక సాధికారతలో డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు.

జీఎస్

**శ్రీపాదరావు జయంతి**

ఉమ్మడి రాష్ట్ర మాజీ శాసన సభాపతి దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి కార్యక్రమాలు పలు జిల్లాల్లో నిర్వహించారు. ములుగు జిల్లాలో కలెక్టర్ దివాకర టిఎస్, పెద్దపల్లి జిల్లాలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష, యాదాద్రి భువనగిరి జిల్లాలో కలెక్టర్ అనురాగ్ జయంతి, కామారెడ్డి జిల్లాలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ గరీమ అగర్వాల్, జనగామ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్  సందీప్ కుమార్ ఝా, వనపర్తి జిల్లాలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డా. సత్య శారద, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ లు దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

పిటిసి లు

**<u>ఇంటర్</u>**

రాష్ట్రంలో ఈరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం గణితం, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం 5 లక్షల 50 వేల 563 మంది విద్యార్థులలో 5 లక్షల 31 వేల 782 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. హాజరు శాతం 96.54గా నమోదైందని తెలంగాణ ఇంటర్ మీడియట్ బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు జరిగిన పరీక్షల్లో మహబూబాబాద్ జిల్లాలో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైందని పేర్కొన్నారు.

**జీఎస్**

**సెంట్రల్ యూనివర్సిటీ**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ కళాశాల అధ్యాపకుల కోసం కృత్రిమ మేధపై అయిదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఈరోజు ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఆంధ్రా యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల ఆరవ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కామర్స్, మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్ విభాగాలకు చెందిన ఎనభై మంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. ఈస్ట్ క్యాంపస్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ వేడుకకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు అధ్యక్షత వహించారు. ఉన్నత విద్యలో కృత్రిమ మేధ ప్రాముఖ్యత గురించి ఆయన ప్రసంగించారు.

**జీఎస్**

**పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం**

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఈ పథకంపై ఈరోజు సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ఇళ్ల పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, వీటివల్ల విద్యుత్ ఖర్చు తగ్గుతుందని అధికారులు వీటిపై ప్రజల్లో అగాహన కల్పించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ పథకం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు.

పిటిసి, ఖమ్మం

**2027 గోదావరి పుష్కరాలు - సమీక్ష**

గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తో కలిసి ఈరోజు 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

జిల్లా పరిధిలో అవసరమైన ఘాట్ల నిర్మాణం, రోడ్డు విస్తరణ, పార్కింగ్, ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.

పిటిసి, పెద్దపల్లి

**మంచిర్యాల అదనపు కలెక్టర్**

మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య తెలిపారు. క్యాన్సర్ నిర్మూలన గోడ ప్రతులను ఈరోజు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 8 వేలకు పైగా బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

పిటిసి, మంచిర్యాల

**హన్మకొండ జిల్లా కలెక్టర్**

గ్రేటర్ వరంగల్ నగర ప్రజా రవాణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం 100 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేసింది. ఈ బస్సుల నిర్వహణ కోసం అవసరమైన స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మడికొండలో ప్రతిపాదించిన స్థలాన్ని అధికారులు పరిశీలించి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచిచారు.

పిటిసి, వరంగల్

**నల్గొండ జిల్లా కలెక్టర్**

ఈ ఆర్థిక సంవత్సరం ఆయా శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై అధికారులు దృష్టి పెట్టాలని నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బడ్జెట్ వృధా కాకుండా ఆయా పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

పిటిసి, నల్గొండ

**వాతావరణం**

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మధ్యాహ్నం వేళ ఎండవేడితో ఉక్కపోత మొదలైంది. వచ్చే 3 రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

ప్రెస్ నోట్

**ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ**

హైదరాబాద్ లోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ ఈరోజు ముగిసింది. గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది టీచర్లకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.  ఈ శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లు తమ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ కళను నేర్పించాలని సూచించారు.

డెస్క్